జడ్చర్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చాయ్ తాగిన కేటీఆర్, హరీశ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మర్రి జనార్దన్‌రెడ్డిని ఓదార్చుతున్న కేటీఆర్, హరీశ్‌రావు

మాజీ ఎమ్మెల్యే మర్రికి కేటీఆర్ పరామర్శ

జంగిరెడ్డి చిత్రపటానికి హరీశ్‌తో కలిసి నివాళులు

పాల్గొన్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

తిమ్మాజిపేట, డిసెంబర్ 24 : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు పలువురు పరామర్శించారు. ఇటీవల మర్రి తండ్రి జంగిరెడ్డి అకాల మరణం చెందడంతో కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్‌అలీ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పరామర్శించారు. తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి ఒకే కారులో వచ్చిన కేటీఆర్, హరీశ్‌రావు మాజీ ఎమ్మెల్యే మర్రిని ఆలింగనం చేసుకొని ఓదార్చారు. అనంతరం జంగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దాదాపు గంటసేపు అక్కడే ఉండి మర్రి తల్లి అమృతమ్మతో మాట్లాడి ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, బాల్క సుమన్, గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఉన్నారు.

ఎగవేతలు.. ప్రతీకార దాడులు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో కూల్చివేతలు, ఎగవేతలు, కరెంటు కోతలు కొనసాగుతున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఏం జరుగుతున్నది? అం టూ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. చిన్నారుల చావులు, కోడెల అమ్మకాలు, అల్లర్లు చెలరేగుతున్నాయని మండిపడ్డారు. అబద్ధాలు, పగలు, ప్రతీకారాలు, దాడులు, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నామని విమర్శించారు. ధర్నాలు, దీక్షలు, కేసులు, అరెస్టుల పర్వం కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఢిల్లీ టూర్లు, అప్పులు, తప్పులు, డైవర్షన్లు, స్టంట్లు, బూతులు, లూటీలు జరుగుతున్నాయని చెప్పారు.

కేసీఆర్, హరీశ్‌రావుకు ఊరట

- ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ఉత్తర్వులపై హైకోర్టు స్టే

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై దాఖలైన ప్రైవేటు పిటిషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట లభించింది. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టాలన్న భూపాలపల్లి ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి నిర్ణయంపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై గతంలో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి దాఖలు చేసిన ప్రైవేట్ పిటిషన్‌ను భూపాలపల్లిలోని మెజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది. దీంతో ఆ తీర్పుపై సమీక్ష జరపాలంటూ ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో రివ్యూ పిటిషన్ వేశారు. దానిపై విచారణ చేపట్టిన ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి.. ఈ ఏడాది జూలై 10న మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులకు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులను సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్ సంయుక్తంగా దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం జస్టిస్ కే లక్ష్మణ్ స్పందిస్తూ.. జిల్లా జడ్జి ఉత్తర్వులను తప్పుబట్టారు. మెజిస్ట్రేట్ కోర్టు తీర్పుపై జిల్లా జడ్జి విచారణ చేపట్టడం సరికాదని, అందుకే ఆ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తున్నానని ప్రకటించారు. కౌంటర్ దాఖలు నిమిత్తం ఫిర్యాదుదారుకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణను జనవరి 7కు వాయిదా వేశారు.

తరగతికి ఒక టీచర్‌ను నియమించాలి

ఎస్టీఎఫ్ ఫోరం డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : నాన్ డిటెన్షన్ విధానాన్ని రద్దుచేసినట్టుగానే సంఖ్యతో సంబంధం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని ఎస్టీఎఫ్ ఫోరం కోరింది. విద్యాహక్కు చట్టాన్ని సవరించాలని ఫోరం అధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ అధ్యక్షుడు ఎండీ కమ్రోద్దీన్ కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

సాయిరెడ్డి కేసులో అరెస్టులేవీ?

- ఎఫ్‌ఐఆర్ ఎక్కడ.. సూసైడ్ నోట్‌కు మించి ఆధారం కావాలా?
- సీఎం సోదరుడని కేసు పెట్టరా.. రైతులనేమో జైల్లో వేస్తరా?
- విద్యార్థుల మరణాలకు బాధ్యతెవరిది
- సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్నరు
- రాష్ట్ర సమస్యలపై అసెంబ్లీలో చర్చించే టైమ్ లేదా?
- రేవంత్‌రెడ్డి సర్కార్‌పై అన్ని వర్గాల ప్రజల ఆగ్రహం
- ఇప్పుడు ఎన్నికలు పెడితే కాంగ్రెస్‌కు డిపాజిట్ రాదు
- మీడియా సంస్థతో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



సాయిరెడ్డి (ఫైల్)

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య కేసులో ముఖ్యమంత్రి సోదరుడిని ఎందుకు అరెస్టు చేయడం లేదని, ఎఫ్‌ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. సూసైడ్ నోట్‌కు మించిన ఆధారం ఏముంటుందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఒక వార్త సంస్థతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లెలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి.. సీఎం రేవంత్ సోదరుడి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన సూసైడ్ నోటు కూడా రాశారు. ఇంతవరకూ అతడిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు, అరెస్టు చేయలేదు' అని విమర్శించారు. చట్టం, న్యాయం అందరికీ ఒకే రకంగా ఉండాలి కానీ, రేవంత్ సర్కారు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తనకు అవసరమైనవారిని వదిలేస్తూ, గిట్టనివారిని అరెస్టు చేయిస్తున్నారని మండిపడ్డారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై ఎందుకు మాట్లాడరు?

తెలంగాణలో అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో, గురుకుల పాఠశాలల్లో 50 మందికిపైగా విద్యార్థులు చనిపోయారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఆహార విషతుల్యంతో, కరెంట్ షాకులతో, పాముకాట్లతో, కుక్కకాట్లతో విద్యార్థులు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించడం లేదని, అసెంబ్లీలో చర్చించడం లేదని మండిపడ్డారు. ఇలాంటి అంశాలపై అసెంబ్లీలో చర్చించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారుకు సమయం లేదా? అని ప్రశ్నించారు. రైతులు, కార్మికులు, దళితులు, మైనార్టీలు, ఇతర వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో చర్చించడం లేదని దుయ్యబట్టారు. కానీ, ఒక సినిమా నటుడి అంశంపై రెండు గంటలు అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి మాట్లాడారని పేర్కొన్నారు.

రైతుల మరణాలకు బాధ్యులు ఎవరు?

సీఎం రేవంత్‌రెడ్డి చట్ట ప్రకారం పాలన సాగించాలని, వ్యక్తిగతంగా టార్గెట్లు పెట్టుకొని ముందుకెళ్లడం సరికాదని హరీశ్‌రావు సూచించారు. 'సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకొని ముందుకెళ్తున్నారు. నేను ఒక్క నటుడి కేసు గురించి మాట్లాడటం లేదు. కేసు పెట్టాలనుకొంటే పెట్టుకోవచ్చు. చట్టం ప్రకారం ముందుకు వెళ్లవచ్చు. ఎవరూ కాదనడం లేదు. ఇలాగే అన్నివిషయాల్లో ఎందుకు ముందుకెళ్లడం లేదు. మీ సోదరుడిని ఎందుకు అరెస్టు చేయడం లేదు. సూసైడ్ నోటుకంటే పెద్ద ఆధారం ఇంకేమి ఉంటుంది? సాయిరెడ్డి ఆత్మహత్య కేసులో ఎందుకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు? దీనికి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాల్సి ఉంటుంది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 500 మందికిపైగా రైతులు, 80 మందికిపైగా ఆటోడ్రైవర్లు చనిపోయారని, వీరి గురించి రేవంత్‌రెడ్డి ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. వీరి గురించి అసెంబ్లీలో ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. చిత్ర పరిశ్రమను లక్ష్యంగా చేసుకొని వారిని వేధించడం మొదలుపెట్టారని ఆరోపించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని, మిగతా అంశాలను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 50 మందికిపైగా చనిపోతే దానికి ఎందుకు బాధ్యత వహించడం లేదని ప్రశ్నించారు. మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారణమైన మీ సోదరుడిపై కేసు నమోదు చేయరు? కానీ, సాగుచేసుకుంటున్న భూములు అడిగితే ఇవ్వనందుకు గిరిజనరైతులను అరెస్టు చేయించి 30రోజులకుపైగా జైళ్లలో ఉంచారని దుయ్యబట్టారు. పరిశ్రమ కోసం భూములు ఇవ్వకుంటే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు డిపాజిట్ రాదు

ఒకవేళ రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే, కాంగ్రెస్‌కు ఎక్కడా డిపాజిట్ కూడా రాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులు, మహిళలు, దళితులు ఇలా అన్ని వర్గాలవారు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. రేవంత్ సర్కార్ ఏడాది కాలంలో ఏ ఒక్క పనీ సక్రమంగా చేయలేదని విమర్శించారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను 365 రోజులైనా నెరవేర్చలేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలందరూ పరేషాన్‌లో ఉన్నారని పేర్కొన్నారు.

శ్యామ్ బెనెగల్ మృతి తీరని లోటు: హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ మరణం తీరని లోటని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఆయన మనల్ని విడిచివెళ్లడం చాలా బాధాకరమని తెలిపారు. మంగళవారం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు స్పందిస్తూ భారత చలన చిత్ర రంగంపై ఆయన వేసిన ముద్ర, చైతన్యవంతమైన రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. శ్యామ్ బెనెగల్ కుటుంబానికి, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హనుమకొండలోని కేయూలో మీడియాతో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బీసీలు అర్హులు కారా?

- వైస్ చాన్స్‌లర్ పదవులూ అగ్రకులాల వారికేనా?
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 24 : రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బీసీలకు అర్హత లేదా? రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో వీసీలుగా అగ్రకులాల వారినే నియమిస్తారా? అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీల జనాభా దామాషా ప్రకారం వైస్ చాన్స్‌లర్లతోపాటు ఇతర పదవుల్లో బీసీలను నియమించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఊరుకునేది లేదని, అవసరమైతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ మెడలు వంచి వాటా సాధిస్తామని చెప్పారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యూనివర్సిటీల్లో ఇప్పటివరకు నియమించిన వైస్ చాన్స్‌లర్ పదవుల్లో కేవలం ముగ్గురికి మాత్రమే బీసీలకు అవకాశం కల్పించి తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్నతవిద్యా మండలి చైర్మన్‌గా కాకపోయినా, కనీసం వైస్ చైర్మన్‌గా కూడా బీసీలను నియమించలేదని దుయ్యబట్టారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా బీసీకి అవకాశం కల్పించకపోతే నిరసన తెలుపుతామని అన్నారు. ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయ భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల భూములను హైడ్రాతో కాపాడాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీలను బలోపేతం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు.

కవితను కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు, విశ్వకర్మ కుల సంఘాల నాయకులు

బీసీల హామీలను విస్మరిస్తే ఊరుకోం

- కామారెడ్డి డిక్లరేషన్ అమలయ్యేవరకు పోరాటం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- కవితతో ముదిరాజ్ మహాసభ, విశ్వకర్మ సంఘాల నేతల భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హామీలన్నీ అమలయ్యేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు, విశ్వకర్మ కుల సంఘాల నాయకులు ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో కలిశారు. తమకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా బీసీలకు ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులను కుదేలు చేస్తున్నదని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుచేయకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. అత్యధికంగా బీసీ విద్యార్థులు లబ్ధిపొందే ఫీజు రీయింబర్స్‌మెంట్, పూలే స్కాలర్‌షిప్ నిధుల విడుదల జాప్యంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో బీసీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తే, నేడు కాంగ్రెస్ ప్రభు త్వం వాటికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో బీసీ సంక్షేమానికి ఎంతఖర్చు చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులు బొల్లా శివశంకర్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు కొట్టాల యాదగిరిముదిరాజ్, దాసరి నరేశ్‌ముదిరాజ్, నాగభూషణంముదిరాజ్, భిక్షపతిముదిరాజ్, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ చీఫ్ అండ్ ఫౌండర్ విశ్వనాథుల పుష్పగిరి, జాతీయ సహాయ కార్యదర్శి చొల్లేటి ప్రభాకర్, అబ్బోజు రామ్ సుధాకరాచారి, హేమ జిల్లోజు, స్తపతి, నరేశ్‌చారి పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో క్రిస్మస్ వేడుకల్లో కేట్ కట్ చేస్తున్న మధుసూదనాచారి. చిత్రంలో మాజీ ఎంపీ రావుల, రాజీవ్ సాగర్, మన్నె గోవర్ధన్ తదితరులు

క్రిస్టియన్లకు అండగా నిలిచిన కేసీఆర్

- క్రిస్మస్ గిఫ్ట్‌గా దుస్తులు.. పల్లెపల్లెనా విందులు
- క్రైస్తవ భవనానికి కేసీఆర్ రెండెకరాల భూమి
- క్రిస్మస్‌కు రెండ్రోజులు సెలవులిచ్చిన ఘనత కేసీఆర్‌దే
- ప్రభుత్వం మారితే పథకాలు రద్దు సరికాదు
- తెలంగాణ భవన్ క్రిస్మస్ వేడుకల్లో మధుసూదనాచారి

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): క్రిస్మస్ పండుగకు రెండు రోజుల సెలవులు ప్రకటించిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుదేనని శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి ప్రశంసించారు. క్రిస్మస్ గిఫ్ట్‌గా దుస్తులు ఇవ్వడంతోపాటు ఎల్‌బీ స్టేడియంతోపాటు రాష్ట్రంలోని పల్లె పల్లెన విందులు ఏర్పాటు చేసిన గొప్ప మనసు కేసీఆర్ ప్రభుత్వానిదని కొనియాడారు. బీఆర్‌ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి ప్రసంగించారు. ప్రపంచ మానవాళిని ప్రభావితం చేసిన మహనీయుడు ఏసుక్రీస్తు అని పేర్కొన్నారు. క్రీస్తుకు ముందు, తర్వాత అని మనం అంటున్నామంటే ఆయన ప్రభావం ప్రపంచంమీద ఎంతలా ఉందో అర్థమవుతున్నదని చెప్పారు. కేసీఆర్ సీఎం అయ్యాక క్రిస్మస్‌కు రాష్ట్ర పండుగ గుర్తింపు ఇచ్చారని గుర్తుచేశారు. క్రిస్టియన్లకు ఉప్పల్ భగాయత్‌లో రెండు ఎకరాల స్థలం కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించారని చెప్పారు. క్రైస్తవుల సమాధుల కోసం 45 ఎకరాలకుపైగా స్థలాన్ని కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరు చేశారని తెలిపారు. కేసీఆర్ క్రైస్తవుల కోసం చేసిన ఎన్నో పనులు ఇపుడు రేవంత్ ప్రభుత్వంలో జరగడం లేదని, ప్రభుత్వం మారితే పథకాలు రద్దు చేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

క్రైస్తవుల కోసం కేసీఆర్ పరితపించారు: రాజీవ్‌సాగర్

క్రైస్తవుల ప్రయోజనాల కోసం కేసీఆర్ ఎంతగానో పరితపించారని తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ పేర్కొన్నారు. ఎల్బీ స్టేడియంలో 15 నుంచి 20 వేల మందికి క్రిస్మస్ విందు కేసీఆర్ హయాంలోనే మొదలైందని గుర్తుచేశారు. ఎల్బీ స్టేడియంలో మొన్న జరిగిన కార్యక్రమంలో సహపంక్తి భోజనం చేయకుండానే రేవంత్‌రెడ్డి వెళ్లిపోవడం క్రిస్టియన్లను బాధించిందని పేర్కొన్నారు. క్రైస్తవ భవన్‌కు కేసీఆర్ నిధులు కేటాయించినా ఈ ప్రభుత్వంలో కనీసం ఒక ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్‌గా తెలంగాణలో ఎవరూ లేనట్టు కేరళకు చెందిన వ్యక్తిని నియమించారని మండిపడ్డారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో క్రైస్తవులకు ప్రకటించిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి సహా పార్టీ నేతలు, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రీస్తు గేయాలు అలరించాయి.

తెలంగాణ తల్లి విగ్రహాల పేరుతో రూ.కోట్లు వృథా

- జూలూరి గౌరీశంకర్ పిల్‌పై హైకోర్టులో విచారణ
- పిల్‌లో మార్పులు చేసి మళ్లీ వేయాలన్న ధర్మాసనం

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తల్లి విగ్రహాల రూపాన్ని మార్చి కొత్త విగ్రహాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించడాన్ని తప్పుబడుతూ రచయిత జూలూరి గౌరీశంకర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం (పిల్)పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. కొత్త విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దాదాపు రూ.150 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయనుండటం సరికాదని గౌరీశంకర్ తరపు న్యాయవాది వాదించారు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నదని, ఈ నేపథ్యంలో రూ.150 కోట్ల ప్రజాధనం వృథా కాకుండా అడ్డుకోవాలని, ఆ నిధులను ప్రజాసంక్షేమానికి వినియోగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. కొత్త విగ్రహాల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టలేమని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో ప్రజాహిత వ్యాజ్యంలో మార్పులు చేర్పులు చేసి మెరుగైన రీతిలో మళ్లీ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సూచించింది. దీంతో ఆ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుని, సంబంధిత అన్ని అంశాలతో వారం రోజుల్లోగా కొత్త పిల్‌ను దాఖలు చేస్తామని పిటిషనర్ తరపు సీనియర్ చెప్పడంతో అందుకు ధర్మాసనం అనుమతించింది.

కేసీఆర్ ఫొటో పేజీ చించేసి!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నది. చరిత్ర పేజీల్లో కేసీఆర్ పేజీలను చింపివేసే కుయుక్తికి ఒడిగట్టింది. 'కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తాం.. నిశానా చెరిపేస్తాం' ఇది తరచూ సీఎం రేవంత్‌రెడ్డి నోటినుంచి వచ్చే ఆణిముత్యాలు. ఈ మాటలను నిజం చేసేందుకు భాషా సాంస్కృతికశాఖ తమ భక్తిని చాటుకుంటున్నది. ఏకంగా ముద్రిత పుస్తకాల్లో కేసీఆర్ చిత్రాలున్న ఫొటోలను చించేసి విక్రయిస్తున్నది. అవేం ఇప్పటికిప్పుడు ముద్రించినవో.. కొత్తవో కాదు. పాత పుస్తకాలు. గతంలో ముద్రించినవే. పూర్తి వివరాల్లోకి వెళ్తే... బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం లో 'తారీఖుల్లో తెలంగాణ' అనే పుస్తకాన్ని ముద్రించారు. ఈ పుస్తకాన్ని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించింది. పదేండ్లుగా ఇది ప్రాచుర్యంలో ఉంది. ఎన్టీఆర్ మైదానంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఈ పుస్తకాన్ని విక్రయిస్తున్నారు. గతంలో ముద్రించిన ఈ పుస్తకంలోని కేసీఆర్ ఫొటో ఉన్న పేజీని చించేసి అమ్ముతుండటం గమనార్హం. ఆయా పేజీకి చించేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పుస్తకాలు విరివిరిగా అమ్ముడయ్యాయి. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేవారు అత్యంత ప్రామాణిక పుస్తకంగా భావిస్తారు. ఇలాంటి పుస్తకంలో కేసీఆర్ ఫొటో ఉన్న పేజీని చించేసి విక్రయిస్తుండటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సర్కారు తీరుపై తెలంగాణవాదులు, కేసీఆర్ అభిమానులు తీవ్రంగా మండిపడుతున్నారు. సర్కారు తీరుపై సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రేవంత్ సర్కారుపై దుమ్మెత్తిపోస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుడు కొణతం దిలీప్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఘాటుగా స్పందించారు. 'కేసీఆర్ ఆనవాలు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్న మూర్ఖపాలకుడిని చూస్తే.. అరచేయిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపడానికి ప్రయత్నించిన వారే గుర్తొస్తున్నారు.. తెలంగాణ చరిత్రపై చెరగని సంతకం కేసీఆర్‌ది. ఆయన ఆనవాలు చెరిపేయాలంటే తెలంగాణ ఆనవాలు లేకుండా చేయడమొక్కటే మార్గం. అది మీ వల్ల కాని పని' అని ఎద్దేవా చేశారు. 'పుస్తకాల్లో పేజీలు చించొచ్చు.. కానీ తెలంగాణ చరిత్రపై ఆయన సంతకం చెరిపివేయలేవు' అంటూ వ్యాఖ్యానించారు. పుస్తకాల్లో కేసీఆర్ ఫొటో ఉన్న పేజీని చించేసి అమ్ముతుండటం నిజంగా బాధేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది వరకు పాఠ్యపుస్తకాల్లో ..

రేవంత్ సర్కార్ గతంలో కేసీఆర్ సహా బీఆర్‌ఎస్ మాజీ మంత్రుల పేర్లు పాఠ్యపుస్తకాల్లో కనిపించకుండా చేసింది. పేర్లు కనిపించకుండా పేపర్‌ను అతికించి కవర్ చేసింది. రాష్ట్రంలో 1-10 తరగతుల్లోని విద్యార్థులకు ఇచ్చిన తెలుగు పుస్తకం ముందుమాటలో తొలి సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కడియం, జగదీశ్‌రెడ్డి, సబిత పేర్లున్నాయి. దీనిని రేవంత్ సర్కారు జీర్ణించుకోలేకపోయింది. ఈ విషయంలో విద్యాశాఖ ఆగమాగంగా వ్యవహరించింది. పుస్తకాల్లో పేర్లున్న విషయం బయటికి పొక్కగానే తొలుత ఆయా పేజీని చింపివేయాలని మౌఖిక ఆదేశాలిచ్చింది. పలు జిల్లాల్లో చింపివేశారు కూడా. ఈ పేజీ వెనుక జన గణ మణ ఉండటంతో నాలుక్కరుచుకుని ఆదేశాలను ఉపసంహరించుకున్నారు. ఆ తెల్లవారే ఈ పుస్తకాలను ఎమ్మార్సీలకు, జిల్లా గోడౌన్లకు రిటర్న్‌చేయాలని డీఈవోలకు ఆదేశాలిచ్చారు. మరో రోజు తిరగగానే పేర్లున్న పేజీని కత్తిరించి కవర్ పేజీ వెనుకవైపు గమ్‌తో లేదా ఫెవికాల్‌తో జన గణ మణ కనిపించేలా అతికించాలని ఆదేశాలిచ్చారు. దీంతోపాటు ఈ వ్యవహారంలో ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసాచారిపై ప్రభుత్వం బదిలీ వేటువేసింది.